క్లుప్తంగా

కాకాణితో విక్రమ్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి భేటీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఉదయగిరి సమన్వయ కర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సోమవారం కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

జ్వరాలపై ఆరా



పొదలకూరు: పట్టణంలో ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది ఫీవర్, లార్వా సర్వేను సోమవారం నిర్వహించారు. స్థానిక విఘ్నేశ్వర పురం కాలనీలో ఇంటింటికీ వెళ్లి జ్వరపీడితుల వివరాలను తెలుసుకున్నారు. జ్వరంతో బాధపడుతున్న వారికి మందులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి నీటి పాత్రలను శుభ్రపరుచుకోవాల్సిందిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రాధాకుమారి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల అందజేత



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని 16వ వార్డులో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ బిట్రగుంట ప్రమీలమ్మ సోమవారం వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పింఛన్లకు ఎలాంటి కొర్రీలు పెట్టకుండా అందజేశామన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఎప్పుడు ఎవరికి పింఛన్ ఊడుతుందో తెలియని పరిస్థితి నెలకొందని తెలిపారు. ఇలాంటి ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెపుతారని తెలిపారు.

ఆత్మీయ సన్మానం



శ్రీనివాసరావును సన్మానిస్తున్న అధ్యాపకులు

విడవలూరు: స్థానిక పీఆర్‌ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయనశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేస్తున్న డాక్టర్ రాయపాటి శ్రీనివాసరావుకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ బి.సుజాత ఆయన సేవలను కొనియాడారు. అనంతరం పూలమాలలతో ఆయన్ను సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎన్.మధు, స్టాఫ్‌క్లబ్ సెక్రటరీ డాక్టర్ వి.శ్రీనివాసమూర్తి, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వినియోగదారులకు అవగాహన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ ప్రమాదాలు అరికట్టేందుకు వినియోగదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ ఆదేశించారు. నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపాటి తప్పిదాల వల్ల విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఐఎస్ఐ నాణ్యత కలిగిన వైర్లు, స్విచ్‌లు మాత్రమే వాడాలన్నారు. తడి చేతులు, కాళ్లతో స్విచ్‌లు వేయకూడదన్నారు. మిద్దెలపై, ఇళ్ల నిర్మాణ పనులు జరిగే సమయంలో విద్యుత్ లైన్లు సమీపంలో ఉంటే సిబ్బందికి తెలియజేసి దూరంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏదైనా ప్రమాదం జరిగిన సమయంలో నేరుగా విద్యుత్ పరికరాలను, షాక్‌కు గురైన వ్యక్తిని తాకకూడదన్నారు. సంబంధిత అధికారి, సిబ్బందికి తెలియజేయాలని కోరారు. సిబ్బంది హెచ్‌టీ, ఎల్‌టీ విద్యుత్ లైన్లలో మరమ్మతులు చేసే సమయంలో పక్కాగా లైన్ క్లియర్ (ఎల్‌సీ) తీసుకోవాలన్నారు.

సత్తాచాటిన కేంద్రియ విద్యార్థులు

నెల్లూరు సిటీ: కొత్తూరులోని కేంద్రియ విద్యాలయానికి చెందిన 55 మంది విద్యార్థులు ఓ జట్టుగా ఆగస్టు 30న విశాఖపట్నంలో జరిగిన యువ పార్లమెంట్ పోటీలో సత్తా చాటినట్లు ప్రిన్సిపల్ కట్టా శంకరయ్య తెలిపారు. ఇందులో ప్రథమ స్థానం కైవసం చేసుకున్న వారిని సోమవారం పాఠశాలలో అభినందించారు. అక్టోబర్ మొదటి వారంలో జోనల్ స్థాయి పోటీలు జబల్‌పూర్‌లో జరుగుతాయన్నారు. వారికి శిక్షణ ఇచ్చిన ఈవ, జోషిబాబు, మంజీత్, అనిల్, మీనాల కృషి అభినందనీయమన్నారు.

వ్యవసాయం వదిలేసి..

- పాడి పరిశ్రమ వైపు రైతులు
- కొందరికి పశువులే జీవనాధారం
- పెరుగుతున్న పాల దిగుబడి



డెయిరీ ఫామ్‌లో ఆవులు

పొదలకూరు: వ్యవసాయం గిట్టుబాటు కాక చాలా మంది రైతులు పాడి పరిశ్రమ వైపు మళ్లుతున్నారు. వరిసాగు చేస్తే ధరల్లేవు. నిమ్మ ఆశించిన ధర పలకడం లేదు. మెట్ట పంటలకు వర్షాలు అనుకూలించడం లేదు. ఈ కారణాలతో అన్నదాతలు క్రమంగా వ్యవసాయాన్ని తగ్గించుకుంటున్నారు. దీంతో పాడి పరిశ్రమ పుంజుకుంటోంది. పాలదిగుబడి గణనీయంగా పెరుగుతోంది. పాడి రైతులు పాల ద్వారా ఆర్థిక స్వావలంబన పొందుతున్నారు. అంతంతమాత్రంగా ఉన్న వరిసాగు ద్వారా వచ్చే గడ్డిని పశువులకు మేతగా వినియోగిస్తున్నారు. రెండు గేదెలను మేపితే కుటుంబం సాఫీగా సాగిపోతుందని చాలామంది పాడిని నమ్ముకుంటున్నారు. గతంలో కరువు, కాటకాలతో గేదెలను తెగనమ్ముకున్నారు. అంతేకాక వర్షపాతం గణనీయంగా తగ్గిపోవడంతో వాగులు, వంకలు, గుంతల్లో నీరు లభ్యం కాక పాడిపశువులు నోరెళ్లబెట్టేవి. ఇప్పుడు వ్యవసాయం కన్నా పాడిపరిశ్రమే మేలని చాలా మంది రైతులు నమ్మి డెయిరీ ఫామ్స్‌ను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఒక లీటర్ పాలులో 10 శాతం వెన్న ఉంటే రూ.80కు అమ్ముడుపోతోంది.

పాలవెల్లువ

మండలంలో ప్రతి గ్రామంలో పాడి గేదెలున్నాయి. తాటిపర్తి, మహ్మదాపురం, సూరాయపాళెం, విరువూరు, నేదురుమల్లి, వెలికంటిపాళెం తదితర పెన్నార్ డెల్టా గ్రామాల్లో పాడి పరిశ్రమ అధికంగా ఉంది. నీటి లభ్యత బాగుండటంతో రైతులు పాడిని నమ్ముకుని కూడా ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. 27 వేల గేదెలు, 3 వేలు తెల్లపశువులు (ఆవులు, ఎద్దులు) ఉన్నాయి. వీటిలో పాలు ఇచ్చే గేదెలు, ఆవులు సుమారు 10 వేల వరకు ఉన్నాయి. వీటి ద్వారా పాడి రైతులు ప్రతినిత్యం సుమారు 31 వేల లీటర్ల పాలను సేకరిస్తున్నారు. 21 వేల లీటర్ల పాలను ప్రభుత్వ (విజయ డెయిరీ), ప్రైవేట్ డెయిరీలకు రైతులు ప్రతినిత్యం పోస్తున్నారు. మిగిలిన 11 వేల లీటర్ల పాలను స్థానికంగా అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు.

శీతలీకరణ కేంద్రాలకు..

మండలంలో ప్రైవేట్ పాల శీతలీకరణ కేంద్రాలు కూడా ఉన్నాయి. తోడేరు పంచాయతీ పరిధిలో, దుగ్గుంట పంచాయతీలో ఉన్నాయి. పొదలకూరు పట్టణంలో కూడా ఇటీవల ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ఏజెంట్ల ద్వారా ప్రైవేట్, ప్రభుత్వ డెయిరీలు పాలను సేకరిస్తూ ఆయా కేంద్రాలకు తరలిస్తుంటారు. ఇక్కడి నుంచి బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ మెయిన్ డెయిరీలకు పాలను ఎగుమతి చేస్తున్నారు.



గేదెలు



పాడి పశువుల మేత కోసం గడ్డిని తరలిస్తున్న రైతులు

పాల దిగుబడి పెరిగింది



గ్రామీణ ప్రాంతాల్లో పాల దిగుబడి పెరిగింది. గేదెలున్న రైతు ఎవరి వద్దకు అప్పునకు వెళ్లనక్కర్లేదు. గేదెలుంటే కుటుంబాన్ని నెట్టుకురావొచ్చు. ప్రతి గ్రామంలో పాడిగేదెల వల్ల రైతులు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. పశువుల ఎరువు కూడా నిమ్మతోటలకు వేస్తుండటం వల్ల బాగా ధర పలుకుతోంది.

– సీహెచ్ రమేష్, రైతు, నావూరుపల్లి

బొడ్డువారిపాళెంలో లార్వా సర్వే



కొడవలూరు: మండలంలోని బొడ్డువారిపాళెంలో కొడవలూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సోమవారం లార్వా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి లార్వా ఉత్పత్తి జరిగే ప్రదేశాలను గుర్తించి నీటి నిల్వ లేకుండా చేశారు. హెచ్ఏ ఒ.సుధాకర్ మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారానే దోమల నివారణ సాధ్యమవుతుందన్నారు. ఇంటి ఆవరణలో రోజుల తరబడి నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమల ఉత్పత్తిని నివారించడంపై ప్రతిఒక్కరిలో అవగాహన కల్పించడం ద్వారా దోమల ఉత్పత్తిని స్వచ్ఛందంగా నివారించుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాంక, ఆశా కార్యకర్త లత పాల్గొన్నారు.

దారి చూపాలని వినతి

మనుబోలు: మండల కేంద్రంలోని జగనన్న కాలనీకి దారి చూపాలని జనసేన మండలాధ్యక్షుడు పెనుబాక ప్రసాద్ కోరారు. సోమవారం పార్టీ నాయకులతో కలిసి తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. బీసీ కాలనీకి ప్రస్తుతం ఉన్న శ్మశాన స్థలం సరిపోడం లేదన్నారు. పక్కనే ఉన్న గుంతను పూడ్చి విస్తరించాలని కోరారు. ఆయన వెంట మహేష్, జాకీర్, ఖాదర్‌వలీ ఉన్నారు.

వైఎస్సార్ వర్ధంతికి విస్తృత ఏర్పాట్లు



కోవూరు: మాజీ ముఖ్యమంత్రి, దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతికి మండల పరిధిలో విస్తృత ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఉదయం 10 గంటలకు కోవూరు మైథిలి సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి నివాళులర్పించనున్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి కోరారు.

ఈ క్రమంలో వైఎస్సార్ విగ్రహానికి విద్యుద్దీపాలంకరణ చేశారు.

వినతిపత్రం అందజేత



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు

కొడవలూరు: రీసర్వేలో మా పొలం వేరొకరి పేరుతో తప్పుగా వచ్చినందున మార్చాలని నార్తురాజుపాళేనికి చెందిన వెంకటరమణయ్య అనే రైతు తహసీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన మండల స్థాయి గ్రీవెన్స్‌డేలో సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మా పొలం మా పేరుపైనే ఉండేదని, రీసర్వే తప్పులు తడకలుగా సాగడంతో వన్‌బీ అడంగల్‌లో పూర్తిగా పేర్లు మారిపోయాయని చెప్పారు. కీలకమైన వన్‌బీ అడంగల్‌లో వేరొక రైతు పేరు నమోదైనందున పొలానికి హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందని చెప్పారు. సమస్య తీవ్రతను గుర్తించి మా పొలం మా పేరుపైనే ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దార్ సమాధానమిస్తూ సాంకేతిక లోపం వల్ల అలా జరిగి ఉండొచ్చని, త్వరలోనే పేరు మార్పునకు చర్యలు తీసుకొంటానని హామీ ఇచ్చారు.

పన్ను బకాయిల రద్దుకు డిమాండ్



నిరసన తెలుపుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డి కాలనీ వాసులకు ఇంటి పన్ను బకాయిలను వెంటనే రద్దు చేయాలని, ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ స్థానిక సచివాలయం వద్ద సోమవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మున్నా మాట్లాడుతూ ఇక్కడ నివసిస్తున్న ప్రజలకు 30 ఏళ్లకు ఒకేసారి ఇంటి పన్ను వేయడం దారుణమన్నారు. కనీస సౌకర్యాలైన తాగునీరు, సైడు కాలువలను ఏర్పాటు చేయకపోగా 30 సంవత్సరాలకు ఒకేసారి వడ్డీతో సహా ఇంటి పన్ను చెల్లించాలని నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. పన్ను చెల్లించకపోతే కరెంట్, నీటి సరఫరాను నిలిపివేస్తామని సచివాలయ సిబ్బంది బెదిరించడం సరికాదని, ఇప్పటికైనా అధికారులు స్పందించకుంటే కార్పొరేషన్ కార్యాలయంతో పాటు, మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు షానవాజ్, లీలామోహన్, బాదుల్లా, షబ్బీర్, గౌస్‌బాషా, వాసుదేవరెడ్డి, మనోహర్, షాజహాన్, సాయి, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నిమజ్జనోత్సవం

ఇందుకూరుపేట: మండలంలోని జగదేవిపేట మజరా నల్లదిబ్బలో ఏర్పాటు చేసిన వినాయకుని నిమజ్జనోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. తొలుత స్వామివారిని విశేష పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మేళతాళాల నడుమ ఊరేగుతున్న స్వామివారికి భక్తులు కొబ్బరికాయ పండ్లు హారతులు పట్టారు. యువకులు రంగులు చల్లుకొంటూ జై గణేష్ మహరాజ్‌కు జై.. అంటూ నినాదాలు చేస్తూ గ్రామోత్సవం వెంట కదిలారు. ఈ క్రమంలో గ్రామంలో కోలాహలం నెలకొంది. మైపాడు బీచ్‌లో నిమజ్జన కార్యక్రమం చేపట్టారు.

⇒ **పొదలకూరు:** పట్టణంలోని పద్మావతి నగర్‌లో వినాయకుని గ్రామోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవంలో పాల్గొన్నారు.

⇒ మండలంలోని పులికల్లు గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా లడ్డూ వేలం పాటను నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన విఘ్నేశ్వర యూత్ వారు రూ.71,500కు దక్కించుకున్నారు.

⇒ **తోటపల్లిగూడూరు:** జిల్లా నలుమూలల నుంచి విగ్రహాలను నిమజ్జనానికి కోడూరు, కాటేపల్లి తీరాలకు తరలించడంతో ఆయా ప్రాంతాల్లో సందడి నెలకొంది. భక్తుల రద్దీ దృష్ట్యా బీచ్‌ల్లో పటిష్ట పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

⇒ **మనుబోలు:** మండల కేంద్రమైన మనుబోలులోని వివిధ మండపాల్లో కొలువుదీర్చిన బొజ్జ గణపయ్యలకు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అట్టహాసంగా గ్రామోత్సవం నిర్వహించి కమాల్ వంతెన వద్ద కండలేరులో నిమజ్జనం చేశారు.



టీపీగూడూరు : కోడూరు తీరంలో..



ఇందుకూరుపేట: నిమజ్జనానికి తరలి వెళ్తున్న గణనాథుడు




పొదలకూరు : ప్రత్యేకాలంకరణలో ఊరేగిన విఘ్నేశ్వరుడు



పొదలకూరు : లడ్డూను దక్కించుకున్న యువకులు



మనుబోలు: పడమటి వీధి గణపయ్య గ్రామోత్సవం



మనుబోలు: నిమజ్జనానికి తరలిన శివాలయం గణనాథుడు

3న ఆరాధన మహోత్సవం

పొదలకూరు: మండలంలోని ఇనుకుర్తి గ్రామంలో ఉన్న శ్రీఅవధూత కాంతమ్మ తల్లి ఆశ్రమం 26వ ఆరాధన మహోత్సవం ఈనెల 3న బుధవారం వైభవం జరుగుతుందని ఆశ్రమ పీఠాధిపతి నాగ సుబ్బారెడ్డి స్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు ఇనుకుర్తి, ముదిగేడు, డేగపూడి గ్రామాల మీదుగా గ్రామోత్సవం ఉంటుందన్నారు. బుధవారం ఉదయం 6 గంటల నుంచి అమ్మవారి అఖండ భజనలు జరుగుతాయన్నారు. అన్నదానం చేస్తామన్నారు. భక్తులు విచ్చేసి తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

మంగళికట్టలో సమస్యల తిష్ట

- మౌలిక సదుపాయాలు కరువు



కాలనీలో తిరుగుతున్న పందులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని మంగళికట్ట జగనన్న కాలనీల్లో రాత్రి వేళల్లో ప్రజలు బయటికి రావాలంటే హడలిపోతున్నారు. విద్యుద్దీపాలు లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో చెట్లపొదల నుంచి పాములు, విష పురుగులు బయటకు వస్తుంటాయి. చిన్నారులు, విద్యార్థులు వీధుల్లో తిరిగేటప్పుడు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. మరోవైపు వీధుల్లో తిరిగే కుక్కలు కాలనీ వాసులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఎప్పుడు ఎవరిని కాటేస్తాయో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. పందులు, పశువులు కాలనీలో ఇష్టారాజ్యంగా తిరుగుతుంటాయి. పారిశుద్ధ్య నిర్వహణ, రోడ్ల నిర్మాణం, వీధిలైట్ల ఏర్పాటు తదితర విషయాలపై మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని కాలనీ వాసులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దృష్టి సారించి కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పీహెచ్‌సీల్లోనే కాన్పులు

- జిల్లా అదనపు వైద్యాధికారి ఖాదర్‌వలీ



సూచనలిస్తున్న ఖాదర్‌వలీ

వెంకటాచలం: పీహెచ్‌సీల్లోనే కాన్పులు జరిగేలా చూడాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ ఆదేశించారు. మండలంలోని చవటపాళెం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యాధికారిణి డాక్టర్ ప్రవల్లికకు పలు సూచనలిచ్చారు. అనంతరం కసుమూరు పీహెచ్‌సీకి చేరుకుని ఓపీ, ల్యాబ్ పరీక్షలు, కాన్పులకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, పీహెచ్‌ల్లోనే కాన్పులు చేయించుకోవాలని గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రణవి, సీహెచ్‌ఓ రామసుబ్బారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో కోవూరు వాసి ప్రతిభ



కోవూరు: క్రీడారంగంలో వయస్సు అడ్డుకాదని కోవూరుకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి కూట్ల శ్రీనివాసులు మరోసారి రుజువు చేశారు. బెంగళూరులో ఆగస్టు 31న నిర్వహించిన జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ఆయన విశేష ప్రతిభ కనబర్చారు. 61 ఏళ్ల పైబడిన విభాగంలో జరిగిన పోటీల్లో జిల్లా నుంచి మొత్తం ఏడుగురు క్రీడాకారులు పాల్గొన్నారు. అందులో శ్రీనివాసులు జిల్లా స్థాయిలో రెండో స్థానాన్ని, జాతీయ స్థాయిలో నాలుగో స్థానాన్ని దక్కించుకున్నారు. ఈ క్రమంలో ఆయనకు మండల వాసులు సోమవారం అభినందనలు తెలిపారు.

యోగా పోటీల్లో సత్తా



రఘురామయ్యను అభినందిస్తున్న నిర్వాహకులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని కాగులపాడుకు చెందిన బి.రఘురామయ్య ఆలిండియా కల్చరల్ ఫెడరేషన్ రన్నింగ్ అండ్ గైడెన్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నాగపూర్‌లో గతనెల 31న నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ 65 సంవత్సరాల విభాగంలో తనకు రెండో బహుమతి రావడం ఆనందంగా ఉందన్నారు. ప్రతిఒక్కరూ యోగాను అలవాటుగా చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన్ను అభినందించారు.